నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 25 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మే 24 : జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనారోగ్య బాధితులకు తన సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం పంపిణీ చేశారు. బుర్హాన్‌పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో రూ.2.50 లక్షల చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ తోట వీరభద్రం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాల్‌రావు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటికి నిరసన సెగ

### ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై గ్రామస్తుల నిలదీత



ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలపై మంత్రి పొంగులేటిని నిలదీస్తున్న పాతర్లపాడు గ్రామస్తులు

తిరుమలాయపాలెం, మే 24 : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో శనివారం పర్యటిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిరసన సెగ తగిలింది. మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో జరిగిన అవకతవకలపై గ్రామస్తులు మంత్రి పొంగులేటిని నిలదీశారు. పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ధనవంతులు, అనర్హులకే ఇందిరమ్మ కమిటీ వారు ఇళ్లు మంజూరు చేయించారని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి స్పందిస్తూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ జరపాలని తహసీల్దారు విల్సన్‌ను ఆదేశించారు. రెండో విడతలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

- పూసపల్లి ఓసీని త్వరగా ప్రారంభించాలి
- ఇల్లెందు సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ఇల్లెందులో సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పూసపల్లి ఓసీ నిర్వాసితులు, అఖిలపక్ష నాయకులు

ఇల్లెందు రూరల్, మే 24 : దేశానికి వెలుగులు పంచిన బొగ్గుట్ట మనుగడ కోసం సమష్టిగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని అఖిలపక్ష నాయకులు అబ్దుల్ నబీ, సారయ్య, వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావు, దాస్యం ప్రమోద్, క్లింట్ రోజ్, రాంసింగ్ అన్నారు. శనివారం ఇల్లెందులోని సింగరేణి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట పూసపల్లి ఓసీ నిర్వాసితులతో కలిసి ధర్నా నిర్వహించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏరియా జీఎం కృష్ణయ్యకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. ఓసీ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని సింగరేణి చేపట్టాలని, తాగునీరు, పారిశుధ్యం రోడ్డు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇల్లెందు ప్రజల మనుగడ కోసం నూతన పూసపల్లి ఓసీని త్వరగా ప్రారంభించాలన్నారు. పూసపల్లి ఓసీ అందుబాటులోకి వస్తే ఇల్లెందులో ఉన్న నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. బొగ్గుట్ట మనుగడ కోసం పార్టీలకతీతంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మొగిలి నర్సయ్య, మహేష్, బాలు సత్యనారాయణ, తాళ్లూరి కృష్ణ, రాజు, విజయ్, సారంగపాణి, హరిసింగ్, యాదగిరి, సత్యం, రాజు, సదా మహేష్ పాల్గొన్నారు.

## సబ్జెక్టుపై మరింత అవగాహనకే శిక్షణ

### వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి

పాల్వంచ, మే 24: ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుపై మరింత పట్టు సాధించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశీలకురాలు, సైట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. పాల్వంచ పట్టణంలోని కొమ్ముగూడెం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా నూతన విద్యా సంవత్సరంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. డీఈవో వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, విద్యార్థుల కోసం నిరంతరం సబ్జెక్టుపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నెహ్రూ నగర్‌లోని స్టిచ్చింగ్ సెంటర్‌ను సందర్శించారు. జూన్ 12 నాటికి ఒక జత యూనిఫాం సిద్ధం చేయాలని సూచించారు. ఆమె వెంట విద్యాశాఖ జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సైదులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది ఉన్నారు.

## డ్వాక్రా మహిళల ఆందోళన

### జమ చేసిన డబ్బులు డ్వాక్రా లీడర్లు స్వాహా చేశారంటూ ఆరోపణ



ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు

బూర్గంపహాడ్, మే 24 : తాము జమ చేసిన డబ్బులు కొందరు డ్వాక్రా లీడర్లు స్వాహా చేశారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సభ్యులు మాట్లాడుతూ మండలంలోని దాదాపు 40 గ్రూపులకు పైగా మహిళలు తీసుకున్న రుణానికి, చెల్లించిన వాయిదాలకు రూ.5 వేలు అదనంగా చెల్లిస్తే ఆ నగదును ఖాతాల్లో జమ చేయకుండా మధ్యవర్తులుగా ఉన్న కొందరు డ్వాక్రా లీడర్లు స్వాహా చేశారని ఆరోపించారు. కూలీనాలీ చేసుకుని డ్వాక్రా గ్రూపులో ఉండి డబ్బును పొదుపు చేసుకుంటుంటే కొందరు చెల్లించిన డబ్బును ఖాతాల్లో వేయకుండా స్వాహా చేయడం ఏమిటని మండిపడ్డారు. తమ డబ్బు జమ చేసేలా చర్యలు చేపట్టాలని ఐకేపీ ఏపీఎం ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన.. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు డబ్బు స్వాహా చేసినట్లు రుజువైతే రికవరీ చేస్తామని, డ్వాక్రా మహిళలకు న్యాయం చేస్తామని ఐకేపీ ఏపీఎం నాగార్జున హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

గతేడాది వచ్చిన వరదలను ఖమ్మం ప్రజలు మర్చిపోలేకపోతున్నారు. అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన మున్నేరు వరద వందల కుటుంబాలను అతలాకుతలం చేసింది. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని గడిపిన క్షణాలు కండ్ల ముందే కదలాడుతున్నాయి. మళ్లీ వర్షాకాలం వస్తుండడంతో మున్నేరు బాధితుల వెన్నులో వణుకు పుడుతున్నది. అయితే 'మున్నేరు కరకట్ట' పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని అనుకున్నారు.. కానీ.. పనులు నత్తనడకన సాగుతుండడంతో భయం గుప్పిట్లోనే బతుకుతున్నారు. మున్నేరుకు రెండు వైపులా కలిపి 17 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించాల్సి ఉండగా.. కేవలం 2 కిలోమీటర్ల పొడవున మాత్రమే.. అది కూడా ప్రభుత్వ భూమి ఉన్న చోటే పనులు ప్రారంభించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా భూసేకరణ ముందుకు సాగడం లేదు. నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చేందుకు నిధులు మంజూరైనప్పటికీ రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఫలితంగా 2026 మార్చి నాటికి పూర్తికావాల్సిన కరకట్ట ఇప్పట్లో పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు.

-ఖమ్మం, మే 24



మున్నేరు నదిలో కరుణగిరి వద్ద జరుగుతున్న కరకట్ట నిర్మాణ పనులు

### నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

మున్నేరు భూ నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న పేద ప్రజలందరికీ భూములు ఇవ్వాలి. ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. గతంలో ఖమ్మంలో కొత్త కలెక్టరేట్ నిర్మించేటప్పుడు, ధంసలాపురం వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణ సమయంలో రైతులకు ఏ విధంగా నష్టపరిహారం ఇచ్చారో అదేవిధంగా ఇవ్వాలి. కరకట్ట నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలి.

– తోట రామారావు, మాజీ కార్పొరేటర్, ఖమ్మం

- రూ.690.52 కోట్లతో ప్రారంభమైన పనులు
- భూ సేకరణ లేదు.. పనులు సాగేదీ లేదు..
- 17 కిలోమీటర్ల పొడవుకు 2 కిలోమీటర్లే పనులు
- గతేడాది షాక్ నుంచి తేరుకోని మున్నేరు బాధితులు
- వర్షాకాలం వస్తుందంటేనే వెన్నులో వణుకు
- ఈ ఏడాది వానలు ఎక్కువంటున్న వాతావరణ శాఖ
- ముంపు నుంచి విముక్తి కోరుతున్న ప్రజలు

# కరకట్ట అయ్యేనా..! కష్టాలు తీరేనా..!



మున్నేరు ముంపు ప్రాంతాల ప్రజలకు గతేడాది జరిగిన నష్టం, పడిన బాధలు అన్నీఇన్నీ కావు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి మున్నేరు ఒడ్డున నివసించే ప్రజల బాధలను పట్టించుకున్న నాధుడే లేడు. అలాంటిది గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం ఎమ్మెల్యే, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దూరదృష్టితో ఆలోచించి మున్నేరు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. మున్నేరు కరకట్ట పనులకు అప్పటి మంత్రులు కేటీఆర్, అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. మున్నేరు కరకట్ట నిర్మాణానికి రూ.690.52 కోట్లను కేటాయిస్తూ జీవో జారీ చేశారు. ఐతే ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు పూర్తికాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించింది. గోళ్లపాడు యాక్సిడెంట్ నుంచి ప్రకాశ్‌నగర్ చప్టా వరకు మున్నేరుకు ఇరువైపులా సుమారు 8.5 కిలోమీటర్ల పొడవున మొత్తం 17 కిలోమీటర్లు కరకట్ట నిర్మించాల్సి ఉంది. కరకట్ట కింది భాగంలో 15 మీటర్ల వెడల్పు.. పైభాగం వచ్చేసరికి 9 నుంచి 12 మీటర్ల వెడల్పు ఉండేలా నిర్మించాలి. కానీ.. ఇప్పటివరకు రెండువైపులా కలిపి కేవలం 2 కిలోమీటర్ల పొడవున.. అదికూడా ప్రభుత్వ భూమి ఉన్నచోట మాత్రమే పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా భూ సేకరణ పనులు ముందుకు సాగడం లేదు. నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చేందుకు నిధులున్నప్పటికీ రెవెన్యూ అధికారులు తీవ్ర ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### 4 వేల ఇండ్లు, 10 వేల కుటుంబాలు

మున్నేరు నదికి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల రామన్నపేట కాలనీ, దానవాయిగూడెం కాలనీ, ఆటోనగర్, పద్మావతినగర్-3, పద్మావతినగర్-2, పద్మావతినగర్-1, వెంకటేశ్వనగర్, బొక్కలగడ్డ(మంచికంటి నగర్) హిందూ శ్మశానవాటిక, మోతీనగర్, రంగనాయకులగుట్ట, పంపింగ్‌వెల్ రోడ్, సుందరయ్యనగర్, ప్రకాశ్‌నగర్, ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి, రాజీవ్ స్వగృహ, కరుణగిరి, నాయుడుపేట, జలగంనగర్, ఆర్టీసీ కాలనీ, సాయిప్రభాత్ నగర్, కోటనారాయణపురం ప్రాంతాలు ఉన్నవి. ఈ ప్రాంతాల్లో సుమారు 4 వేల ఇండ్లు, 10 వేల కుటుంబాలు నివసిస్తున్నవి. గత ఏడాది మున్నేరుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా 42 అడుగుల వరద.. దాదాపు 3 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో ఆ ప్రాంత జనాభా మొత్తం వారం రోజులపాటు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. మున్నేరుకు వరదలు రావడం కొత్తమీ కాదు.. 2005లో 34 అడుగులు వచ్చింది.. ఇదే రికార్డు. కానీ.. గతేడాది వచ్చిన వరద మున్నేరు చరిత్రలో ఇప్పటివరకు రాలేదు. 2023లో కూడా దాదాపు 32 అడుగుల వరద వచ్చింది.

### భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది..



మున్నేరు కరకట్ట నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ చట్టం కింద ఇప్పటివరకు రైతుల నుంచి 70 ఎకరాలు తీసుకున్నాం.. ఇంకా 69 ఎకరాలు తీసుకోవాలి. ఆ ప్రక్రియ కొనసాగుతోంది. రైతుల అంగీకారంతోనే భూములు తీసుకుంటున్నాం. నష్టపోతున్న వారికి ఖమ్మంకు దగ్గరలో పోలేపల్లి రెవెన్యూలో భూములు ఇవ్వనున్నాం. ఎకరం స్థలానికి 700 గజాలు, ప్లాట్ ఉంటే ఎన్ని గజాలు ఐతే అన్ని గజాలు ఇస్తున్నాం. ఇండ్లకు సంబంధించి వ్యాల్యువేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది.

– జి.నర్సింహారావు, ఖమ్మం ఆర్డీవో

### పనులు శరవేగంగా జరుగుతున్నయ్..



ఖమ్మంలో మున్నేరుకు ఇరువైపులా నిర్మిస్తున్న కరకట్ట నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో 4 కిలోమీటర్ల పొడవున పనులు నడుస్తున్నాయి. ప్రైవేటు భూముల్లో కూడా వారంరోజుల్లో పనులు ప్రారంభిస్తాం. నిర్దేశించిన సమయంలోగా కరకట్టను పూర్తి చేస్తాం.

–మంగళపుడి వెంకటేశ్వర్లు, ఎస్ఈ, ఖమ్మం

### నత్తనడకన భూసేకరణ

మున్నేరు కరకట్ట పనులు ప్రారంభం కావడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అనేక ఏండ్లుగా మున్నేరు ఒడ్డున నివసిస్తున్న తమ ఇళ్లను కూల్చుతారా.. అనే భయంతో బతుకుతున్నారు. మున్నేరు ముంపు ప్రాంతాల్లో నివాస స్థలాలు, ఇళ్లు, ప్లాట్లతో పాటు వ్యవసాయ భూములు ఉన్నాయి. ఐతే ప్లాట్లు, ఇళ్లు రిజిస్ట్రేషన్ ఉన్నవాటికి, పట్టాలు ఉన్న భూములకు నష్టపరిహారం ఇస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే వాటికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

## బయోచార్‌తో జిల్లా ముందుకెళ్లాలి : భద్రాద్రి కలెక్టర్



బొగ్గును పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 24 (నమస్తే తెలంగాణ) : ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే 'బయోచార్'తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందుకెళ్లాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఈ దిశగా శనివారం ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయం పక్కన స్వయంగా మొట్టమొదటి ప్రయోగాత్మక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండిపోయిన మొక్కలు, పనికిరాని చెట్లకొమ్మలను తక్కువ ఆక్సిజన్‌తో కాల్చడం ద్వారా ఏర్పడే శాశ్వత కార్బన్ నిల్వతో కూడిన బొగ్గే బయోచార్ అని తెలిపారు. గ్రామస్థాయిలో చిన్న బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటమే కాకుండా, స్వయంగా ఉపాధికి మార్గం సుగమమవుతుందన్నారు. బయోచార్ అనేది ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే ఉత్తమ మార్గంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## 698 కిలోల గంజాయి పట్టివేత

### ఆరుగురు నిందితుల అరెస్ట్, రెండు వాహనాలు సీజ్



గంజాయి నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేశ్

టేకులపల్లి, మే 24 : వాహన తనిఖీల్లో భాగంగా 698 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్ తెలిపారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. టేకులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో సీసీఎస్, సివిల్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ వ్యాన్‌ను తనిఖీ చేయగా.. 698 కిలోల నిషేధిత గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు రూ.3.49 కోట్లు ఉంటుందని సీఐ తెలిపారు. వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా.. ఏపీ రాష్ట్రం అల్లూరి జిల్లా వై.రామవరం మండలం బచ్చలూరు నుంచి సీలేరు మీదుగా హర్యాన రాష్ట్రం కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్‌కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున గంజాయిని హర్యానకు రవాణా చేస్తూ పట్టుబడ్డారు. నిందితులు సందీప్‌కుమార్, లక్వీందర్, అమర్‌నాథ్ కుమార్, పవన్‌కుమార్, రాజ్‌కుమార్, కృష్ణకుమార్.. అమ్మిన వ్యక్తి హరికరన్ వద్ద నుంచి ప్రిన్స్‌కుమార్‌కు అందజేసేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఆరుగురు వ్యక్తులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. గంజాయిని అమ్మిన, కొనుగోలు చేసిన, రవాణా చేసిన వ్యక్తులందరిపై కేసు నమోదు చేసి, ఐచర్ వ్యాను, కారు, ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. కాగా.. గంజాయి తరలిస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ సురేశ్, ఎస్సై రాజేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవణ్, రామారావులను ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

### పట్టుబడిన గంజాయి దహనం

ఖమ్మం, మే 24 : వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వంలో శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన 90.70 కిలోల ఎండు గంజాయిని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) నరేష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి పర్యవేక్షణలో తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామం లో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ బయో వేస్టేజ్ బర్నింగ్ ప్లాంట్‌లో దహనం చేశారు. ఖమ్మం వన్‌టౌన్, త్రీటౌన్, ఖమ్మంరూరల్, ఖానాపురంహవేలి, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, వేంసూరు, వీఎం బంజర, ఏన్కూరు పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన 17 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో సీసీఆర్బీ సీఐ స్వామి, తల్లాడ ఎస్సై కొండల్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేతన సవరణ ప్రకటించాలి

### ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి సోయం హనుమంతరావు డిమాండ్




మాట్లాడుతున్న సోయం హనుమంతరావు

పాల్వంచ, మే 24 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ ప్రకటించాలని ఏటీఏ రాష్ట్ర కార్యదర్శి సోయం హనుమంతరావు డిమాండ్ చేశారు. పాల్వంచలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్యంతర శిక్షణ కొనసాగుతున్న కేంద్రం వద్ద ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏటీఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్-2 భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కల్లూరి బొర్రయ్య, సోయం కృష్ణ, కొమరం నారాయణ స్వామి, నాగలక్ష్మి, వర్సా చంద్రశేఖర్, తెల్లం సరస్వతి, సున్నం రమేశ్, పూనెం యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

### 'సీతారామ' పనులను త్వరగా పూర్తిచేయండి

– ఆర్అండ్‌బీ శాఖ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న వినయ్‌కృష్ణారెడ్డి

జూలూరుపాడు, మే 24 : సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ శాఖ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలోని సీతారామ ప్రాజెక్టు క్యాంపు కార్యాలయాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పాపకొల్లు రెవెన్యూ పరిధిలోని అటవీప్రాంతంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. భూ సమస్యలు పరిష్కరించి త్వరగా రైతులకు నష్టపరిహారం అందజేయాలని, అందుకోసం అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, సీతారామ ప్రాజెక్టు ఎస్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో ప్రసాదరావు పాల్గొన్నారు.